క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే కమిటీ సమావేశం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

చౌడేపల్లె: సమస్యల పరిష్కారానికే సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి అన్నారు. మంగళవారం ఏ.కొత్తకోటలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ సమస్యలపై తొమ్మిది మంది ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శాంతిపురం: మండలంలోని 64 పెద్దూరు పంచాయతీ మహిళలు తాగునీళ్ల కోసం ఆందోళన బాట పట్టారు. రక్షిత మంచినీటి బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నా దిగువ వీధిలోని ఇళ్లకు మూడు రోజులుగా నీళ్లు రావడం లేదని నిరసిస్తూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. కుప్పం నుంచి గెసికపల్లె మీదుగా కేజీఎఫ్ వెళ్లే రోడ్డుపై బైఠాయించారు. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పగిలిన తాగునీటి పైపులను సరిచేయాలని పంచాయతీ కార్యదర్శికి ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకున్న పాపానపోవడం లేదని మండిపడ్డారు. వీరి ఆందోళనతో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో స్థానిక నాయకులు జోక్యం చేసుకున్నారు. పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకు తెరపడింది.

వైష్ణవిదేవి ఆలయంలో నాగ పంచమి వేడుకలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చౌడేపల్లె: నాగ పంచమి సందర్భంగా మండలంలో పుదిపట్లలోని స్వయంభు శ్రీ వైష్ణవిదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నాగభైరవస్వామికి అర్చకురాలు శ్రావణిరెడ్డి పంచామృతాభిషేక పూజలు, కుజదోష పరిహారపు పూజలు చేశారు. పలమనేరు మండలం ఏడూరుకు చెందిన వెంకటరమణారెడ్డి, సుభద్రమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మహమ్మదాలీకి లయన్స్ గవర్నర్ అవార్డు



లయన్ గవర్నర్ చంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహమ్మదాలీ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరుకు చెందిన లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీకి లయన్స్ గవర్నర్ అవార్డు అందుకున్నారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును లయన్స్ గవర్నర్ చేతుల మీదుగా మంగళవారం స్వీకరించారు. వివిధ సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడం, విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ, క్లబ్ కార్యక్రమాలు విస్తృతం చేయడం..ఇత్యాది వాటిని పరిగణనలోకి తీసుకుని ఈఅవార్డు తనకు ప్రదానం చేశారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ వీవీ కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాంరాజ్ ఆర్ష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పుంగనూరు: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముడిపాపనపల్లె పీహెచ్‌సీ డాక్టర్ సృజన అన్నారు. మంగళవారం పుంగనూరు మండలంలోని అడవినాధునికుంట ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా జ్వరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత గురించి వివరించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్

పుంగనూరు: పట్టణంలోని ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థులకు మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరణం రాజేష్ పాల్గొన్నారు.

దారులను మింగేస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే..!

పలమనేరు నియోజకవర్గం మీదుగా ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే ప్రకటన తొలినాళ్లలో ఈ ప్రాంతవాసులకు ఎంత ఆనందం కలిగించిందో ఇప్పుడు అంతే వేదన కలిగిస్తోంది. ఎక్స్‌ప్రెస్ హైవేకు ఇరువైపులా ఎవరూ వెళ్లకుండా సిమెంట్‌తో ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. అవసరమైన చోట అండర్ పాస్‌లను నిర్మించలేదు. ఫలితంగా నియోజకవర్గంలో 60 వరకూ గ్రామాలు, కొన్ని కాలనీలు, పొలాలకు వెళ్లే వందలాది దారులు మూసుకుపోయాయి. అధికారుల దృష్టికి సమస్యలను నివేదించినా ఇప్పటివరకూ పరిష్కారం చూపకపోవడంతో పలు గ్రామాలు శాపనార్థాలు పెడుతూ అవస్థల నడుమ రాకపోకలు సాగిస్తున్నాయి.



పట్టణ సమీపంలోని బ్రిటీషర్ల నాటి రోడ్డుకు అడ్డుగా ఎక్స్‌ప్రెస్ హైవేతో గడ్డూరు కాలనీకి దారిలేకుండా పోయిన దృశ్యం



కల్లాడు వద్ద పొలాల వద్ద పశువుల మేత కోసం ఎక్స్‌ప్రెస్ హైవే దాటి వెళుతున్న రైతులు

- హైవే దెబ్బకు వందలాది దారులు మాయం
- గ్రామాలు, కాలనీల రోడ్లకు అడ్రస్‌లేని అండర్‌పాస్‌లు
- హైవేకు ఇరువైపులా ఎవరూ వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మాణం
- కిలోమీటర్ల మేర చుట్టుకుని ప్రజలు వెళ్లాల్సిన దుస్థితి
- అధికారుల దృష్టికి సమస్యలను నివేదించినా పరిష్కారం శూన్యం

పలమనేరు: ఎక్స్‌ప్రెస్ హైవేకు ఇరువైపులా మనుషులు, మూగజీవాలు, వాహనాలు వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. హైవే నిర్మాణ డిజైన్‌లో ఇలాగే ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఫలితంగా ఎక్కడైతే ఇతర రోడ్లకు కనెక్టింగ్ పాయింట్ ఉంటుందో అక్కడ తప్పితే ఎవరూ దీనిపైకి వెళ్లడం సాధ్యం కాదు. అయితే అవసరమైన చోట్లలో



పకీర్‌పల్లె వైపు వెళ్లే దారులపై అడ్డుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే



గొల్లపల్లె నుంచి ఏడు గ్రామాలకు ఏర్పాటు చేసిన అండర్‌పాస్‌లో వరదనీరు చేరి రాకపోకలకు లేకుండా పోయిన వైనం

మాత్రం అండర్‌పాస్‌లు నిర్మించకపోవడమే ప్రధాన సమస్యగా మారింది.

కాలనీ ఇళ్లకు దారేదీ..?

మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు, బోడిరెడ్డిపల్లె ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో సుమారు 4వేల కుటుంబాలున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవే రాకముందు ఇక్కడి ప్రజలు కూర్మాయి రోడ్డు, బ్రిటీషర్ల కాలం నాటి 80 అడుగుల రోడ్డులో వెళ్లేవారు. అయితే ఈ రోడ్ల మధ్య ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవే రావడంతో కాలనీకి దారి బంద్ అయ్యింది. దీంతో వీరు తావడపల్లె రోడ్డులోగానీ అటు కౌండిన్య వైపు నుంచి సైతం వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. మరోవైపు గడ్డూరు వద్ద అండర్‌పాస్ నిర్మాణం లేకుంటే కూర్మాయి మార్గం ద్వారా రూరల్ మండలంలోని 20 గ్రామాలకు ఇబ్బందులు తప్పవు. అలాగే, మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో నిర్మించిన జగనన్న కాలనీకి దారి లేకుండా పోయింది! వీరు మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లాలంటే 4–5 కిలోమీటర్ల చుట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి కలిగింది.

బ్రిటీషర్ల కాలం నాటి రోడ్డుకు ఎసరు..!

గతంలో బ్రిటీషర్ల హయాంలో పట్టణానికి బైపాస్‌గా టి.వడ్డూరు క్రాస్ నుంచి గడ్డూరు కాలనీ, కిండర్‌కేర్ మీదుగా మెయిన్‌రోడ్డును కలిపేలా ఈ బైపాస్‌రోడ్డును 80 అడుగులతో అప్పట్లో నిర్మించారు. అయితే ఈ రోడ్డుకు అడ్డంగా ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవే రావడంతో బ్రిటీషర్ల దారి మాయమైంది.

ఎన్నో గ్రామాలు, కాలనీలకు ఇదే పరిస్థితి

ఎక్స్‌ప్రెస్‌హైవే కర్ణాటక రాష్ట్రంలోని హులుక్కూర్ నుంచి వీ.కోట మండలంలో ప్రవేశిస్తోంది. అక్కడి నుంచి బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపాళెం, గుడిపాల మండలాల మీదుగా తమిళనాడుకు వెళుతోంది. ఈ మార్గాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలు, పొలాలకు వెళ్లే దారులు ఇప్పుడు లేకుండా పోయాయి. పలమనేరు మండలంలోని దిగువకల్లాడు, ఎగువ కల్లాడు, నడిమికల్లాడు, గజ్జలవారిపల్లె మీదుగా పకీరుపల్లెకు దారి లేకుండా పోయింది. మరోవైపు ఎక్స్‌ప్రెస్ హైవే గ్రామాల నుంచి పొలాలకు వెళ్లే వందలాది కాలిబాటలు లేకుండాపోయాయి. దీంతో రైతులు పొలం పనులకు, పశువుల మేతకు ఎలావెళ్లాలో దిక్కుతోచడం లేదు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వాహకులు అండర్‌పాస్‌లను అప్పట్లో డిజైన్‌లో ప్రతిపాదించకపోవడమే వీరందరికీ శాపంగా మారింది. దీనిపై ఎన్‌హెచ్ అధికారులను అడిగినా తమకు సంబంధం లేదనే మాట వినిపిస్తోంది.

చెరువులకు వర్షపునీరు రాకుండా పోయింది

ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో 30 వరకూ చెరువులున్నాయి. వీటికి వర్షపు నీరు వచ్చే మార్గంలో నీరు రాకుండా కనీసం రోడ్డు కింద డ్యామ్‌లు నిర్మించలేదు. దీంతో వర్షపునీరు చెరువుల్లోకి వెళ్లకుండా అక్కడే చిన్నపాటి చెరువుల్లా మారుతోంది. హైవేలో గ్రామాలకు దారి వదిలిపెట్టిన అండర్‌పాస్‌ల వద్ద వరదనీరు చేరుతోంది. దీంతో ఈ మార్గాల్లో జనం ప్రయాణించలేని పరిస్థితి దాపురించింది.

ఏడు గ్రామాలకు దారే లేదాయె..!



మా ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ హైవే కారణంగా ఏడు గ్రామాలు, పొలాల వద్దకు దారులు లేకుండా పోయాయి. వారు దారులు పెట్టిన అండర్ పాస్‌ల వద్ద వరదనీరు ఏటిలో పోయినట్టు వెళుతోంది. ఈ దారుల్లో అస్సలు వెళ్లలేం. దీనిపై ఇటీవలే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం.

–నరసింహారెడ్డి, ఎగువ మూరుమూరు, పలమనేరు మండలం

గ్రామాలకు దారులు లేని మాట నిజమే



ఇటీవల కొలమాసనపల్లె పంచాయతీ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నేనే వెళ్లి దారుల సమస్యను పరిశీలించా. పలు గ్రామాలకు దారులు లేకుండాపోవడం వాస్తవమే. వ్యవసాయ భూములకు వద్దకు దారులు లేవు. వారు ఏర్పాటు చేసిన అండర్‌పాస్‌ల కింద వరదనీరు చెరువుల్లా మారింది. ఈ మార్గాల్లో వెళ్లడం సాధ్యం కాదు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా.

–ఇన్బునాథన్, తహసీల్దార్, పలమనేరు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

వి.కోట :నూతనంగా ఎన్నుకున్న వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు గ్రామ స్థాయి కార్యకర్తల సమస్యలను పరిష్కరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని జవునిపల్లె, ఎస్.బండపల్లె, కృష్ణాపురం, చింతమాకులపల్లె పంచాయితీలలో మండల, పంచాయతీ నాయకుల సమక్షంలో పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. యువరాజ్ మాట్లాడుతూ, కమిటీ సభ్యులు ఒక పదవిగా కాకుండా బాధ్యతగా పనిచేయాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపిరెడ్డి, యువత అధ్యక్షుడు పవన్‌కుమార్, రైతు విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ శివరాం, సోషల్ మీడియా శివ, స్టూడెంట్ విభాగం శ్యామ్, నాయకులు కుమార్‌రాజా పాల్గొన్నారు.



కమిటీ సభ్యుల ఎన్నుకుంటున్న మండల కన్వీనర్, నాయకులు

అర్హులైన రైతులకు రుణాలు ఇవ్వాలి

–ఎల్‌డీఎం హరీష్

పలమనేరు: అర్హత కలిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ హరీష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులతో పాటు, కౌలు రైతులకు రుణాలివ్వాలన్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన జేబీవై రుణాలను సైతం ఇవ్వాలన్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ–4పై ధనవంతులు పేదలను దత్తత తీసుకుని బంగారు కుటుంబాలను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

కురబలు ఐక్యంగా ఉండాలి

సదుం: కురబలందరూ ఐక్యంగా ఉండాలని తిరుపతి భక్త కనకదాస విగ్రహావిష్కరణ కమిటీ కన్వీనర్ వెంకటప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సదుంలోలో కురబ కులస్తుల సమావేశం నిర్వహించారు. తిరుపతిలో కనకదాస విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కురబలు అన్ని రంగాలలో రాణించాలని, జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ రెడ్డికుమార్, వెంకటరమణ, నారాయణ బాబు, అమర్నాథ్, శ్రీనివాసులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కురబ సంఘ నాయకులు

కీటక జనిత వ్యాధులపై అవగాహన

వి.కోట : రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని కీటక జనిత వ్యాధులైన మలేరియా,డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఈశ్వర్ కోరారు. కీటక జనిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండల అధికారుల సమన్వయంతో పంచాయతీల వారీగా డెంగీ నివారణకు కమిటీలు ఏర్పాటు చేసి అవగహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గతంలో పాజిటివ్ వచ్చిన హైరిస్క్ ప్రాంతాలను గుర్తించడం, ముందస్తు ప్రణాళిక తయారు చేసి లార్వా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల సమన్వయంతో కృషి చేయాలన్నారు. అన్ని పంచాయతీలలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇంటింటా సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి నాణ్యత పరీక్షలు సకాలంలో నిర్వహించి నివేదికలు పంపాలన్నారు. కార్యక్రమంలో ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి, పంచాయతీ సెక్రటరీలు, ఏఎస్ఎంలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వర్


పట్టు తప్పితే అంతే..!

చౌడేపల్లె-పుంగనూరు మార్గంలో ఆటోల్లో ఇష్టానుసారంగా ప్రయాణికులను తరలిస్తున్నారు. బడి ఈడు పిల్లలతో ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్న ఆటో సాక్షి కెమెరాకు చిక్కింది. ఆటో నిండా విద్యార్థులే కాకుండా వెనుక వైపు సైతం కమ్మీ స్టాండ్‌పై ఓ విద్యార్థి నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాడు. పట్టు తప్పితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ఓవర్‌లోడుతో వెళ్తున్న ఆటోలను కట్టడి చేయాల్సి ఉంది.

–చౌడేపల్లె



నిధులు పక్కదారి పట్టించారా, ఖర్చు చేశారా ..?



సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు



హాజరైన ప్రజాప్రతినిధులు

- గ్రామాల్లో మద్యం అక్రమాలు పెరిపోయినా పట్టించుకోరా?
- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

గంగవరం: మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు గురించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా?.. నిధులను పక్కదారి పట్టించారా? ఖర్చు చేశారా? సమాధానం చెప్పాలంటూ సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈఓఆర్‌డి/ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటప్రసాద్ సమావేశం ప్రారంభించారు. తొలుత శాఖల వారీగా అధికారులు మాట్లాడారు. అనంతరం సభ్యులు తమ గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలను ప్రస్తావించారు. పంచాయతీలో వెలుగు సిబ్బంది పనితీరు ఏమాత్రం సరిగా లేదని, పథకాల గురించి ఎలాంటి సమాచారం సభ్యురాళ్లకు తెలియజేయడం లేదని ఎంపీటీసీ భారతి ప్రశ్నించారు. అలాగే పేద ప్రజలకు కేటాయించిన జగనన్న కాలనీలో ఇంతవరకూ ఎవరికీ ఇళ్ల స్థలాలు చూపలేదని రెవెన్యూ అధికారులను నిలదీశారు. గుండుగల్లు ఏఎన్ఎం పోస్టుతో పాటు వీఆర్ఓ పోస్టు భర్తీ చేయాలని సర్పంచ్ రమణ, సామలగడ్డలో టీచర్ పోస్టు భర్తీ చేయాలని ఎంపీటీసీ భాస్కర్ కోరారు. ఆ తరువాత సర్పంచులు గిరిరాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి మద్యం బెల్ట్‌షాపులపై ధ్వజమెత్తారు. మండలంలో బె విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారని, ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయకుండా బెల్ట్ షాపులను అభివృద్ధి చేస్తోందని విమర్శించారు. ఈ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్‌ను ప్రజాప్రతినిధులకు కేటాయించకుండా జాప్యం చేశారని, అసలు నిధులను ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. పంచాయతీ తీర్మానాలు కార్యదర్శులకు అందజేస్తే నిధులు కేటాయిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పార్వతి, తహసీల్దార్ రేఖ, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రసాద్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ'

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటలో బుధవారం ఉదయం 9:30 గంటలకు, దుర్గసముద్రంలో 11 గంటలకు, చారాలలో మధ్యాహ్నం 2 గంటలకు, శెట్టిపేటలో 3:30 గంటలకు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల కన్వీనర్ జి.నాగభూషణరెడ్డి తెలిపారు. అలాగే గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లె ఎస్సీ కాలనీలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

పీఎంశ్రీలో పుంగనూరు ఏపీ మోడల్ స్కూల్ ఎంపిక



అడవినాధునికుంటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీ ఈఓ

పుంగనూరు: పీఎంశ్రీ పథకం కింద పుంగనూరు మండలంలోని అడివినాధునికుంట ఏపీ మోడల్ స్కూల్ ఎంపికైంది. మంగళవారం డీఈఓ వరలక్ష్మి ఏపీసీ వెంకటరమణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో 40 పాఠశాలలు పోటీ పడగా వీటిలో పుంగనూరు మోడల్ స్కూల్ ఎంపికైనట్లు ఏపీసీ చెప్పారు. పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వారు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గ్రీష్మిత



యోగా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

రొంపిచెర్ల: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తమ స్కూల్ విద్యార్థిని గ్రీష్మిత ఎంపికైందని స్థానిక ఆకాష్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ చైర్‌పర్సన్ సంగీత మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి యోగా పోటీలలో ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చాటారని, గ్రీష్మిత ద్వితీయ స్థానంలో నిలిచిందని, వచ్చే నెల రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. యోగా పోటీలలో ప్రతిభ చాటిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతానాయర్, బీడీఎం వినయ్ రాజన్, టీచర్లు ద్వారక, రోజా, ఇమ్రాన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మానిటరింగ్ సమావేశం బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

పుంగనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. తహసీల్దార్ రాము అధ్యక్షతన సమావేశం ప్రారంభించినప్పటికీ అధికారులెవరూ హాజరుకాకపోవడంతో సభ్యులు ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీలంటే అధికారులు వివక్ష చూపుతున్నారని మానిటరింగ్ కమిటీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి, కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

అదుపు తప్పి పడి మోటార్ సైక్లిస్టుకు గాయాలు

పుంగనూరు: మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పుంగనూరు– పలమనేరు మార్గంలోని గూడూరుపల్లె వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం..వీ.కోటకు చెందిన హరీష్ బైక్ మీద వెళ్తూ అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.